# మానవుని సుఖ, దుఃఖములకు అతని నడవడియే కారణము

మనసులోనున్న భావంబు మంచిదైన
కలిగి తీరును ఫలసిద్ధి కార్యమందు
మనసులోనున్న భావంబు మలినమైన
ఫలము కూడను ఆ రీతి మలినమగును.

విద్యార్థులారా!

భారతీయ సంస్కృతి అనుపమానమైనది. అత్యున్నతమైనది. మనిషి అంటే మనసే! మనసంటే సంకల్పముల చేరికయే! సంకల్పముల ప్రభావమే నడతలు. నడతలయొక్క ఫలితమే సుఖదుఃఖములు. ఈనాటి మానవుడు అనుభవించే సుఖదుఃఖములకు మూలకారణము అతని యొక్క నడవడియే! ఈ నడవడికి మూలకారణము సంకల్పములే! ఈ సంకల్పముల చేరికే మనసు. మనసునుంచి వచ్చినవాడు కనుక, ఇతనికి 'మనిషి' అని పేరు. మనసే లేక మనిషి కాడు. మనసు కలవాడే మనిషి. పశుపక్షి మృగాదులకు మనస్సు లేదు.

**ఐకమత్యమే ఆనందమునకు, శాంతికి మూలకారణము**

మనసుద్వారా వాక్కు ఆవిర్భవిస్తున్నది. ఈ మనస్సు అహం తత్త్వము నుండే ఆవిర్భవించింది. అహము ఆత్మయొక్క ప్రతిబింబమే. వాక్కు, మనస్సు, అహం, ఆత్మ ఈ నాలుగు ఒకే కుటుంబమునకు చెందినవి. ఇందులో వాక్కు, మనసు, అహం మూడు చేరినప్పుడే మానవత్వం దివ్యత్వముగా రూపొందుతుంది. ఈ మూడుకూడ అన్యోన్య అనురాగ బాంధవ్యముతో కూడినప్పుడే మానవత్వము దివ్యత్వము పొందుతుంది. ఈ మూడింటి ఏకత్వమునకు భిన్నము జరిగినప్పుడు అనేక విధములైన అశాంతికి గురౌతుంది. ఒక ఇంట్లో ముగ్గురు సోదరులుంటారు. ఈ ముగ్గురు ఒకరినొకరు అనుసరించి ప్రేమించి ఒకరితో ఒకరు

sri sathyasai vachanamrutam

అన్యోన్యముగా కలసి ఉండినప్పుడే ఇంటిలో శాంతి ఏర్పడుతుంది. ఏకారణము చేతనైనా మనస్సునందు అభిప్రాయ భేదములు ఆవిర్భవించినప్పుడు, ఒకరినొకరు ద్వేషించి భిన్నముగా ప్రవర్తించినప్పుడు, ఆ అశాంతి ఇల్లంతా పాకిపోతుంది. ఐకమత్యమే ఆనందమునకు శాంతికి మూలకారణము. ఐకమత్యము చేరునప్పుడే అసంతుష్టికి, అశాంతికి ఒక విధమైన కారణము ఏర్పడుతుంది.

ఇక్కడ ఇల్లు ఏది? ముగ్గురు అన్నదమ్ములు ఎవరు? దేహమనేది ఒక ఇల్లు. లేక దేవాలయము. ఈ గృహమనే దేహమందు ముగ్గురు అన్నదమ్ములున్నారు. Thoughts, words, action. సంకల్పములు, వాక్కు, క్రియాశక్తి – ఈ ముగ్గురు అన్యోన్యముగా, ఐకమత్యముగా, ఆనందముగా కలసిమెలసి ఉండినప్పుడే ఏ కార్యమునైనా విజయము సాధించవచ్చు. కానీ సంకల్పములు ఒకవైపున, పలుకులు మరొకవైపున, పని ఇంకొకవైపున పోయినప్పుడు, ఒకదానికొకటి ఐకమత్యము చెదరినప్పుడు ఏ కార్యమూ మనము సాధించలేము. ఈ మూడింటి ఏకత్వమునకే త్రికరణశుద్ధి అన్నారు. మన గృహమందు ఈ మూడింటి ఐకమత్యమునకు తగిన ఉత్సాహ, ప్రోత్సాహములను పురికొల్పాలి.

**సత్సంగముచేత మనలోని దుర్భావములను నిర్మూలము గావించుకోవచ్చు**

నిర్భయుడై, క్రూరుడై, కఠినుడై రత్నాకరుడు అనేక క్రూరకార్యములు తన పొట్టకూటి నిమిత్తమై, కుటుంబపోషణ నిమిత్తమై చేస్తూవచ్చాడు. తన సంకల్పములన్నీ క్రూరమైన సంకల్పములుగా రూపొందినాయి. నిర్దయ స్వరూపము ధరించింది. కారుణ్య శూన్యమై కాఠిన్యము అభివృద్ధి అయింది. కనుక, దారులు కొట్టే దొంగగా తయారయ్యాడు రత్నాకరుడు. వీరు, వారు అనే భేదములేక అందరినీ చంపటము, వారి ధనము అపహరించటము ఈ విధమైన మార్గములో ప్రవేశించాడు. ఎంతకాలమునుండియో దుర్గుణములను, దురాలోచనలను, దుస్సంకల్పములను అభివృద్ధి గావించుకున్న ఈ రత్నాకారుడు ఒకతూరి సప్తఋషులను దర్శించటంచేత పాపనాశనమైంది. వీరిని అడ్డగించి చంపుటకు ప్రయత్నించాడు, రత్నాకరుడు. "నాయనా! చంపటము మంచిది కాదు. క్రిమికీటకాదులు మానవునికి కీడు చేస్తుంటాయి. మేలు చేసేవాడే  మనిషి. మేలు చేయటానికి ప్రయత్నించు, కీడు చేయటానికి

sri sathyasai vachanamrutam

ముందంజ వేయకు. ఎందుకోసం ఈ పని చేస్తున్నావు?

**జానెడు పొట్ట నింపుకొన చిక్కుల నొందుచు కోటి విద్యలన్**
**పూనిక మీర నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక యీ**
**మానవ జాతి దుఃఖముల గ్రమ్మగ నేటికి? శ్రీపరాత్పరున్**
**ధ్యానము చేయు భక్తులకు దారిని చూపకయున్నె మానవా!**

పిచ్చివాడా! ఈ చిన్న పొట్టనిమిత్తమై కోటి మందిని బాధపెట్టి నీ పొట్ట నింపుకొని నీవు అనుభవించే సుఖము ఏమిటి? నీ కుటుంబము ఏ సుఖము అనుభవిస్తున్నది? ఇట్టి పాపకృత్యములు తలంపకు. నీవు శరీరము ధరించిన వ్యక్తివి కనుక నేటినుండి కర్తవ్యము లాచరించి, కరచరణాది అవయవములతో కర్మలాచరించి భజించి భుజించు", అని సప్తఋషులు అతనికి బోధించగా వారి సందర్శనముచేత, సంభాషణచేత అతని సంకల్పములు మార్పు చెందినాయి. కనుక, సత్సంగము మానవునికి ప్రధానలక్ష్యము. సత్సంగముచేతనే ఏకాగ్రతను పోషించుకోవచ్చు. సత్సంగముచేత మనలోని దుర్భావములను నిర్మూలము గావించుకోవచ్చు. చెడ్డ సంకల్పముల నిర్మూలమే మోక్షమునకు మూలకారణము.

**సత్సంకల్పే నిస్సంకల్పత్వం**
**నిస్సంకల్పత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చల తత్త్వం**
**నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః**

సత్సంకల్పములు ప్రతి మానవుడు ప్రయత్న పూర్వకముగా సాధించటానికి ప్రయత్నించాలి. ఆనాటినుండి సప్త ఋషుల ప్రబోధలచేత, ప్రోత్సాహముచేత ఉత్సాహము అభివృద్ధియై రామనామము చింతిస్తూ కూర్చున్నాడు. రామనామము చేతనే తన జీవితము ధన్యమైపోయింది. లోకనాథుడు భగవంతుడైనప్పుడు శ్లోకదాత వాల్మీకి అయ్యాడు. శ్లోకనాథుడు లేక లోకనాథుని ప్రచార ప్రబోధలు జగత్తుకు వ్యాపించి ఉండేవి కాదు. వాల్మీకి లోకమునకు ఆదర్శము నిరూపించాడు.

**ప్రతిమానవుడు దోష రహితుడు, గుణ పోషకుడు కావాలి**

sri sathyasai vachanamrutam

ప్రతి మానవుడు ఆదర్శప్రాయుడు కావాలి. మానవత్వములో ఉండిన ఘనత ఎంతో గొప్పదిగా ఉంటున్నది. మానవునియందు లేని శక్తి మరొకదానియందు కనిపించదు. సర్వశక్తులు మానవునియందు ఇమిడి ఉంటున్నవి. అయితే సరైనరీతిగా సంస్కరింప చేసుకోవాలి. దోషములు నిర్మూలము గావించి గుణములు పోషించుకున్నప్పుడు, పోషించుకున్న గుణములు ఆచరణలో పెట్టినప్పుడు ఆనందమునకు సరైన ఆలవాలమై పోతుంది. ప్రతి మానవుడు దోషరహితుడు కావాలి. గుణపోషకుడు కావాలి. అప్పుడే మానవుని యందు దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి చేకూరుతుంది. నిజముగా నమ్మి పూజించి, విశ్వసించి, పాల్గొన్న వ్యక్తి ఏనాటికి చెడదు.

**నమ్మక చెడినవారలున్నారు గానీ**
**నమ్మి చెడినవారు ఈలోకాన లేరు.**

**దైవావాక్కును విశ్వసించాలి**

ఈనాటి మానవుడు నమ్మకమనే నేత్రములు కోల్పోయినాడు. నమ్మరానివాటి నన్నింటిని నమ్ముతున్నాడు. నమ్మతగినవి నమ్మటం లేదు. అందరిని నమ్ముతాడు మానవుడు; దైవమును నమ్మడు. ఈనాడు ఏకాదశి అంటున్నాము క్యాలండరులో. ఈ క్యాలండరు ఒక సిద్ధాంతి వ్రాసినది. ఎవరో ఒక సిద్ధాంతి వ్రాసిన పంచాంగమును ఆధారము చేసుకొని ఈనాడు ఏకాదశియని విశ్వసించి ఏకాదశి వ్రతము ఆచరిస్తున్నావు. ఈనాడు ఆదివారం అంటే దానిని ఆధారము చేసుకొని సెలవు అంటున్నావు. ఆదివారం అని, ఏకాదశియని ఎట్లా నమ్మావు? ఒక సిద్ధాంతి వ్రాసిన దానిని నమ్ముతున్నావు. విశ్వసిస్తున్నావు. సాక్షాత్ వేదములే "తత్వమసి, నాయనా! నీవే ఆత్మస్వరూపుడవు. ప్రజ్ఞానం బ్రహ్మ. అయమాత్మ బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి." అనే ముఖ్యవిషయములు బోధిస్తుంటే ఎందుకు నమ్మటం లేదు? ఇదే మానవుని బలహీనత. సత్యమైన దానిని నమ్మలేక పోతున్నాడు. కనుక మానవుడు ఇన్ని విధములైన కష్టములకు, నష్టములకు, విచారములకు గురౌతున్నాడు. దైవవాక్కు తు.చ. నమ్మాలి. దైవ వాక్కును మనం నడచుకోవాలి. అప్పుడే సరైన స్థితి కలుగుతుంది. కానీ మానవుడు దీనిని నమ్మలేకపోతున్నాడు.

ఒకానొక సమయంలో షిర్డీలో భక్తుడైన నానా కుమార్తె మీనా ప్రసవవేదనతో

sri sathyasai vachanamrutam

బాధపడుతుంది. మూడు నాలుగు దినములై పోయింది. చాలా నీరసించింది. ఆమె ప్రాణము ఉంటుందో లేదో అనే సందేహస్థితి వచ్చింది. నూరు సంవత్సరముల పూర్వము ఎట్టి వైద్యము, ఎట్టి ఆసుపత్రులు, నర్సులు ఉండేవారు కాదు. నిరంతరము పటము దగ్గర "బాబా బాబా బాబా నా కుమార్తెను రక్షించు" అని ప్రార్థించాడు నానా. భక్తుడు ఎక్కడ ఏవిధముగా ప్రార్థించినా భగవంతునికి ఒక connection ఉంటున్నది. వైర్‌లెస్ కంటె వేగముగా చేరుతుంది. భక్తునికి భగవంతునికి heart to heart, love to love హృదయమునకు హృదయ సంబంధము. తక్షణమే బాబాకు తెలిసింది. అక్కడ బాపూ అనేవాడు ఉండేవాడు. రంగ్‌బాపూ. అతనిని బాబా 'బాపూ'! అని పిలచేవాడు. 'బాపూ రా! విభూతి తీసుకొని జామ్నేర్ గ్రామములో నున్న నానాకు అందించు' అన్నాడు. ఆజ్ఞ అన్నాడు. జేబులో చూచుకున్నాడు. రెండు రూపాయలున్నాయి. జల్గాంవరకు రైలులో పోవచ్చు. జామ్నేరు పోవటానికి తన దగ్గర డబ్బులు లేవు. బాబా నా దగ్గర కాసులు లేవు. నన్ను ఎలా వెళ్లమంటారు అన్నాడు. "ఒరే పిచ్చివాడా! నేను చూచుకుంటాను. పొమ్మని ఎప్పుడు చెప్పానో తగిన arrangements నేను చూచుకుంటాను. సందేహమునకు చోటివ్వకు", అని బాబా అభయమిచ్చాడు. ఇట్లే రామావతారమందు రాముడు హనుమంతుని ఆజ్ఞాపించాడు. 'హనుమా నీవు సీతాన్వేషణ జరపాలి. లంకలో ప్రవేశించి సీత ఏవిధంగా ఉంటున్నదో ఆమె స్థితిగతులు కనుక్కొని రమ్మ'న్నాడు. హనుమంతుడు సందేహించాడు. 'ఇంత పెద్ద సముద్రము నేను ఏవిధంగా దాటాలి? నన్ను పొమ్మని చెబుతున్నారు' అని కొంత సందేహించాడు. ఆజ్ఞ ఇచ్చినవాడే ఈ కార్యము పూర్తి చేయించుకుంటాడు. నాతో ఈ కార్యము సాధించుటకై నాకీ కార్యము ఇచ్చాడు. ఇంకెవ్వరికి ఇవ్వలేదే. ఆజ్ఞాపించిన భగవంతుడు ఈ కార్యములో అన్నీ తానే చూచుకుంటాడని ధైర్యముతో వెళ్లాడు. పరిశుద్ధమైన విశ్వాసము. అచంచలమైన విశ్వాసము. బాపూ కూడా సందేహముతో ప్రశ్నించాడు బాబాను. నాదగ్గర రెండు రూపాయలున్నాయి నేను ఇంత దూరము ఎట్లా పోవాలి. జల్గాం నుండి ముప్పైమైళ్లు పోవాలి. ఆ రోజుల్లో టాంగాలు మాత్రమే ఉండేవి. ముప్పై మైళ్లు టాంగాలో వెళ్లాలి. లేక నడచిపోవాలి. ముప్పై మైళ్లు నడవగలనా అని సందేహిస్తుండగా బాబా ధైర్యము నిచ్చాడు. నామాట విశ్వసించు నా ఆజ్ఞ శిరసా వహించు. నీవు వెళ్లు అన్నాడు. జవాబు చెప్పకుండా జల్గాం వరకు రైలులో వెళ్లాడు. రాత్రి 1 1/2 గంటలకు జల్గాంలో దిగాడు. నేను ఎక్కడికి

sri sathyasai vacanamrutam

పోయేది ఈ చీకటిలో ఏవిధంగా కాలము గడపాలి? అని అక్కడ కూడా కన్నులు మూసుకొని బాబాను ప్రార్థించాడు. ఒక బిళ్లజవాను వచ్చాడు. పాతకాలములో తహసీల్దారు వెంట బిళ్ళవేసుకొని జవాను ఉండేవాడు. ఆ జవాను ఆజానుబాహువు. 'ఎవరు బావూ? ట్రైనులో దిగారు షిర్డీనుండి'; అని కేకలు వేసుకుంటూ వచ్చాడు. 'బాబా పంపుతే వచ్చాను. నా పేరు బావూ' అన్నాడు. 'రండి రండి మీకోసం టాంగా కాచుకొని ఉంటున్నాది' అన్నాడు. ఎక్కడనుంచి వచ్చింది? అన్నాడు. 'నానా సాహెబ్ పంపించాడు'. టాంగాలో కూర్చున్నాడు. తాను పోతుంటే టాంగా నడచినట్లే లేదు. అంత స్పీడుగా పోతున్నది. తనలో అనుకుంటున్నాడు ఎంత స్పీడుగా పోతున్నాది అని. ఈ విధంగా తలచుకుంటుంటే గ్రామము వచ్చింది. అదుగో అదే నానా ఇల్లు అని చూపించాడు. ఆయన దిగాడు నడచి; తిరిగి టాంగావానితో చెబుదామని వెనుకకు తిరిగాడు. టాంగా లేదు. టాంగా నడిపేవాడు లేడు. సరే ఇంటికి వచ్చి చేరాడు. 'నానా సాహెబ్! ఇదుగో బాబా విభూతి పంపించాడు', అని చెప్పాడు. ఎప్పుడు పంపాడు? అని అడుగగా 'నిన్న సాయంకాలమే పంపాడు; రాత్రి 1 1/2 గంటలకు స్టేషను చేరాను. మీకు ఎట్లా తెలిసిందో ఏమిటో మీరు టాంగా పంపటంచేత శీఘ్రముగా ఇల్లు చేరగలిగాను', అని వివరించాడు. నానాకు ఆశ్చర్యం వేసింది. 'నా దగ్గర టాంగా లేదే? నేను ఎవరిని పంపలేదే? నీవు వచ్చేది నాకు తెలియదే. ఎందుకు ఈ విధంగా చెబుతున్నావు. ఆ టాంగా ఎక్కడుంది చెప్పు'మన్నాడు. 'అయ్యా! దిగిన వెంటనే టాంగా కనిపించలేదు. అతను చెప్పటం మీరు పంపినట్లు చెప్పాడు' అన్నాడు. మాటలకు సమయము కాదు, మొట్టమొదట పేషెంటుకు ఇవ్వాలని లోపలకు వెళ్లి ప్రసాదము ఇచ్చాడు. బాబా పటము దగ్గరకు వెళ్లి ప్రార్థన చేశాడు. 'బాబా! బాబా! బాబా!' అని అరిచాడు. ఆ అరుపులోపలనే బిడ్డ అరుపులు వినిపించాయి. కుమారుడు పుట్టాడు.

ఆనందముతో తిరిగి బావూ దగ్గరకు వచ్చి 'బావూ! ఏమేమి జరిగిందో చెప్పు. బాబా ఏమి చెప్పారు? ఏ విధంగా వచ్చావు?' అని అడిగేటప్పటికి 'రెండు రూపాయలతో నేను వచ్చాను. బాబాయే అన్ని సదుపాయములు చేశాడు. నమ్మిన వారిని వదలడు. నమ్మకమే ప్రధానమైనది' అని చెప్పాడు. 'నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి నేడు అవనియందు'. 'నమ్మకమనే నయనములు కోల్పోయినాము మనము ఈనాడు. నమ్మి పనిచేస్తే దేనిలోనైనా విజయము చేకూర్చుకోవచ్చు. ఈ నమ్మకము చేతనే నేను అంత ఆనందము

sri sathyasai vachanamrutam

పొందగలిగాను'. మూడవ దినము నానా, బావూ ఇద్దరు కలసి షిరిడీ వెళ్లారు. 'బాబా! ఏమి నీయొక్క నాటకము! ఏమి నీ సందేశము! ఏమి నీ లీలలు! ఇవి వర్ణనాతీతమైనవి' అని బాబాతో చెప్పారు. ఇదే రీతిగా ద్వాపరయుగములో గోపికలు, రామావతారంలో వానరులు భగవంతుని ఈ రీతిగా వర్ణిస్తూ వచ్చారు. నానాది చక్కని కంఠము. చక్కగా పాటలు పాడేవాడు. అక్కడకు వెళ్లి ప్రార్థన చేశాడు.

**నిను కనుగొనగలమా బాబా! నిను కనుగొనగలమా!**
**అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు**
**ఘనము కంటె అతి ఘననీయుడవు**
**ఎనుబది లక్షల జీవరాసుల అనయంబును ఎడబాయకుందువట**
**అణువు రేణువు తృణకాష్ఠము మొదలుగ అఖండరూపుడవై వెలయుదువట**
**ఘనమగు దొంగలలో గజదొంగవు ॥నిను॥**

'బాబా అన్నీ నీకు తెలుసు. కానీ తెలియనివానివలె నటిస్తావు. నీవు బడా చిత్తచోరుడవు,' అని బాబాకు విన్నవించుకున్నాడు. ఇందులో రహస్యము గుర్తించాలి. ఎవరైనా వచ్చి 'గజదొంగవురా' అంటే మనకు కోపం వస్తుంది. ఏమి దొంగతనం చేశాను? ఎందుకు గజదొంగ? అంటున్నావు! అని వానిపై పోట్లాడుతావు. అదే పదములలో పాటగా పాడితే "బడా చిత్తచోర బృందావనసంచార గోపాల గోపాల హేమురళీ గోపాల" అంటే అందరు తాళం వేసి పాడతారు. గానములోనున్న మాధుర్యము ఇంత ఆనందముగా ఉంటుంది. ప్రేమరసమును త్రాగిన ఉన్మత్తుడై పోతాడు. పాటలయందు, మాటలయందు ఉన్న మాధుర్యము ఇట్టిది అట్టిదియని ఎవరు వర్ణించలేరు.

**భగవంతుడు గానలోలుడు, గానప్రియుడు**

ఒక ఉదాహరణము. పిల్లలు చక్కగా తెలుసుకోవాలి. భగవంతుని గాన ప్రియుడని పిలుస్తాము. భగవంతుని మాటలతో పిలుస్తే ఒకరీతిగా ఉంటుంది. పద్యము రీతిగా పిలుస్తే ఒక రీతిగా ఉంటుంది. పాటల రీతిగా పిలుస్తే ఒకరీతిగా ఉంటుంది. 'హే రామ! ఎంత దయామయుడవయ్యా నీవు!' అంటే మనసు కరగదు. 'ఓ రామా! నన్ను కాపాడు' అని

పద్యములో చెబుతే అదికూడా అంత గొప్పగా ఉండదు. 'రామా! నన్ను కాపాడు' పాటతో వస్తే హృదయాన్ని లాగేస్తుంది. గానలోలుడు, గానప్రియుడు భగవంతుడు. అక్కడ నానా గానము చేస్తున్నాడు. బాబా కూడా ఉన్మత్తుడయ్యాడు. మత్తుతో తల ఊపుతున్నాడు. ఆ పాట తాను కూడా కోరస్ పాడుతున్నాడు. ఈ విధముగా గానము పాడే వానిని తన్మయము గావిస్తుంది. దైవాన్ని కూడా తాండవమాడిస్తుంది. కనుక దైవమును ప్రార్థించే సమయములో భజనకు ఇంత విలువ ఇవ్వటానికి కారణమిదియే. భజన హృదయపూర్వకముగా చేయాలి. వాల్మీకి రామ చరిత్రము రాముని జీవిత కాలములోనే రచించినాడు. కుశలవులచేత సభలో రామచరిత్రను పాడించాడు వాల్మీకి. నిరంతరము దయారహితుడై, క్రూరుడై, కృపాహీనుడై జనులను హింసిస్తూ వచ్చిన రత్నాకరుడు రాళ్లను కూడా కరిగించగల రామనామ గానముచేత దివ్యమైన రామచరిత్రను ప్రపంచమునకందించగలిగాడు.

**హృదయ పీఠముపై భగవంతు డొక్కడినే ప్రతిష్ఠించాలి**

కఠినమైన రాయిని కూడా కరిగించి, పెరిగించి ఫలము నిచ్చేదిగా మారుస్తుంటాది దివ్యమైన నామము. చిన్న ఉదాహరణము. కఠినమైన గుండు ఉంది. ఆ గుండుపైన విత్తనాలు పెడితే ఎండిపోతాయి. లేక పక్షులు ఎత్తుకొనిపోతాయి. ఆ కఠినమైన రాయిపై మొక్కలు రావు. క్రమక్రమేణా ఎండకు ఎండి వానకు నాని రాయి కరిగి కరిగి మట్టిగా మారిపోతుంది. మట్టిలో విత్తనము పెట్టినప్పుడు విత్తనము మొక్కగా వస్తుంది. మొక్క వృక్షముగా మారిపోతుంది. వృక్షములోనే ఫలములు వస్తాయి. ఫలములు మానవుడు భుజిస్తాడు. ఫలముల యొక్క ప్రసాదమే మానవరూపము ధరిస్తుంది. కఠినమైన రాయి కరగి మానవునిగా రూపొందింప చేసింది ఏది? ఆ రాయే. అదే విధముగా కఠినమైన రత్నాకరుని హృదయము మారిపోయింది. అదే తపస్సుగా రూపొందింది. అదే వల్మీకము అనగా పుట్టగా రూపొందింది. ఆ వల్మీకము పెరిగి వర్షములో తిరిగి కరిగిపోయేటప్పటికి అందులోనుంచి ఆవిర్భవించాడు వాల్మీకి. వల్మీకము నుండి పుట్టినవాడు కనుక ఇతనికి 'వాల్మీకి' అని పేరు వచ్చింది. పూర్వము రత్నాకరుడు కఠిన హృదయుడు. పాముల పుట్టకు వల్మీకమని పేరు. ఇది కరిగిపోయి ఇతను బయటపడ్డాడు.

srisathyasaivachanamrutam

కనుకనే ఇతని పేరు వాల్మీకి. విద్యార్థులు కఠినమైన భావములు, క్రూరమైన సంకల్పములు హృదయములో చేరకుండా చూచుకోవాలి. సద్భావములు, సచ్చింతనలు, సదాలోచనలు మనం పెంచుకోవాలి. కఠినమైన హృదయాలు మృదుమధురంగా మారతాయి. ఆ హృదయమే భగవంతుని నివాసంగా మారుతుంది. హృదయమనే పెద్దపీఠము ఎవరిది? ఎవరిదో కాదు, భగవంతునిదే. ఆ భగవంతుని పీఠముపైన మరొకరు కూర్చొనుటకు వీలుకాదు. నీ మనసులో ఎవరినైనా కూర్చోపెట్టుకో. ఎంతమందికైనా చోటు ఉంటుంది. కానీ హృదయము ఒక్కటే, single sofa, not double sofa, not musical chair. ఒకరిని ఒక పర్యాయము, ఇంకొకరిని ఒక పర్యాయము ఈవిధంగా మార్చుకో కూడదు. ఒక్క దైవమునకు మాత్రమే చోటు ఇవ్వాలి. అదే ఈనాడు మనం చేయవలసినది.

**మంచి సంకల్పములు వెంటనే అమలుపరచాలి, చెడుని వాయిదా వేయాలి**

ఎన్నో మనము జగత్తులో చూస్తున్నాము. ఎన్నో అనుభవిస్తున్నాము. ఎంతమంది అనుభూతులో మనకు వినిపిస్తున్నాయి. మంచి చెడ్డలు మన ప్రవర్తననుంచి వస్తున్నాయి గానీ, పరులనుండి వచ్చేవి కాదు. మొట్టమొదట మన సంకల్పములను పవిత్రమైన సంకల్పములుగా రూపొందించుకోవాలి. మనలో ఏదైనా సంకల్పము వస్తే is it good or bad అని ఆలోచించుకోవాలి. టైము తీసుకో, ఇది నీకు మంచిది కాదనుకుంటే తక్షణమే వదలిపెట్టు. కానీ ఈనాటి మానవునకు అంత ఓపిక లేదు. ఏదైనా సంకల్పము వస్తే తక్షణమే పని చేయటానికి ప్రయత్నిస్తాడు. రాముని అస్త్రము తగిలి రావణుడు క్రిందకూలాడు. కొన్ని నిముషములలోపల ప్రాణం వదలేముందు అనేకమంది మహర్షులు వచ్చారు. ఇంత గొప్ప మహనీయుడు, గొప్పతపస్వి, అన్ని శక్తులు కలిగినవాడు ఇతని దివ్యలక్ష్యమేమిటో తెలుసుకోవాలని అందరు చేరారు. 'రావణా! నీ జీవితములో సంకల్పించింది ఏమిటి, సాధించింది ఏమిటి?' అని ప్రశ్నించారు. రామ బాణము తగిలింది కనుక పాపపరిహారమైంది. ఉన్నత భావములావిర్భవించాయి. చేతులు ఎత్తలేక ఎత్తలేక నమస్కారము చేశాడు. "ఓ మహనీయులారా! నేను ఏమి చెప్పుదును! నా సంకల్పములెన్నో ఉన్నాయి. కానీ అవి కాలేకపోయాయి ఒక్కటి మాత్రం గుర్తించాలి. జీవితములో మంచి చేయాలని మంచి సంకల్పమే వస్తే ఆలస్యం చేయకూడదు. తక్షణమే పనిలో చేరాలి. మంచి పని వాయిదా వేయకూడదు.

sri sathyasai vachanamrutam

మంచి పనులకు ఏమాత్రము టైము తీసుకోవద్దు. సంకల్పము, పని రెండు ఒక్కతూరి జరగాలి. చెడ్డ భావములే వస్తే వాటి జోలికి పోవద్దు. కావలసినంత టైము తీసుకో. నేను సంకల్పించుకున్నాను. లంక చుట్టూ ఉన్న సముద్రములోని నీరు తీయగా మార్చాలని సంకల్పించుకొన్నాను. తరువాత తరువాతయని వాయిదా వేసాను. కట్టకడపటికి ఆ మంచిపని నేను చేయలేకపోయాను. నరకములో బాధపడేవారిని స్వర్గమునకు పంపించాలని వారిని సుఖరూపులుగా తయారు చేయాలని సంకల్పించుకున్నాను. కానీ తరువాత తరువాత అని వాయిదా వేసుకుంటూ వచ్చాను. మంచి కార్యము వాయిదా వేశాను. నేను మరణిస్తున్నాను. ఈ మంచి కార్యములు నేను చేయలేకపోతున్నాను. మీరైనా సత్సంకల్పములు వచ్చిన తక్షణమే క్రియారూపములో పెట్టండి. కాలము వ్యర్థము చేయకండి. చెడ్డ భావములు, చెడ్డ తలంపులకు అవకాశము ఇవ్వకండి" అని చెప్పాడు. అదియే ఈనాటి యువకులు చేయవలసిన గొప్ప ఘనకార్యము. ఈనాటి యువకులు భావిభారతోద్ధారకులు. మీరు సద్భావములను అభివృద్ధి పరచుకొని ఆదర్శ పౌరులనే పేరు తెచ్చుకోవాలి. ఆదర్శ పౌరుడుగా ఉన్నప్పుడు ఎంతైనా ఆదర్శమును అనుభవించవచ్చు. ఎంతమందినైనా మార్చవచ్చు. కనుక, మనము సద్భావములు పోషించుకోవాలి.

**దేశము, దేహముయొక్క ప్రతిబింబమే**

దీనినే వ్యక్తిగత శీలమన్నారు. వ్యక్తిగత శీలము కలిగినప్పుడే లీడరుగా తయారుకావచ్చు. వ్యక్తిగత గుణములు మనం పోషించుకోవాలి. వ్యక్తిగత శీలము, సామాజిక శీలము, జాతీయ తత్వము మనం అభివృద్ధి పరచుకోవాలి. జాతీయ భావమే పోయింది. నేను, నా కుటుంబము అంతవరకే ప్రయాణము చేస్తున్నారు.

**ఇది నా మాతృదేశము**
**ఇది నా ప్రియమాతృభాష**
**ఇది నా మతమంచు ఎదగొట్టి నుడవనేరని**
**బ్రతికిన పీనుగు ఒక్కండు వసుధ గలడా**

దేశాభిమానము లేక నీవు బ్రతికిన పీనుగుగా తయారౌతావు. దేశాభిమానము పెంచుకోవాలి.

sri sathyasai vachanamrutam

దేహాభిమానము ఎంత ప్రధానమో దేశాభిమానము అంత ప్రధానము. దేశము, దేహముయొక్క ప్రతిబింబమే. దేశము, దేహము రెండు బింబప్రతిబింబములే!

ఈనాటి విద్యార్థులు తమ పవిత్ర శీలముచేత గుణముల అభివృద్ధి చేత సంకల్పములను చక్కగా మార్చుకోవాలి. చెడ్డ సంకల్పములకు అవకాశము ఇవ్వకూడదు. కొంచెము చోటిస్తే అది పెంచుకుంటుంది. ఏమాత్రము చెడ్డ సంకల్పములు ప్రవేశపెట్టకూడదు. అవి వచ్చెనా మనము వెనకకు నెట్టాలి. ఎట్లా? మన హృదయ కవాటము మూసి వేయాలి. మనము ఒక ఇల్లు కట్టాము. ఇంటికి కిటికీలు, ద్వారాలు పెట్టాము. ద్వారములు ఎందుకోసం? మనం లోపలకు బయటకు పోవటము రావటము కోసం పెట్టాము. మన బంధువులు, మిత్రులు లోపలకు రావటానికి పోవటానికి పెట్టాము. తలుపులు పెట్టుకున్నామని కుక్కలను, పందులను, గాడిదలను వదలుతామా? మనకు పది ద్వారములుంటున్నాయి. ద్వారము లోపల బయట చెత్త చేర్చుకోకూడదు. చెడ్డవాటిని బయటకు తరమాలి. దుర్గుణములు దూరమునుంచే దూరము చేయాలి. లోపల ప్రవేశించేంతవరకు మనం కాచుకోకూడదు. రత్నాకరుడు వాల్మీకిగా మారిపోయాడు. మానవుడై పుట్టి విద్యావంతులై సుగుణములంతా ఉంటుండి మానవుడు మాధవత్వము పొందలేకపోతున్నాడంటే ఎంత అవమానము! విజ్ఞాన ప్రజ్ఞానములతో కూడిన దివ్యత్వముగా రూపొందాలి. ఆ దివ్యభావము చేత మానవత్వము చక్కగా తీర్చిదిద్దుకొని దైవత్వంగా రూపొందాలి.

శివునికి ముందుగా నంది ఉన్నది. నంది అంటే పశువు. పశువు ఎక్కడ చూస్తున్నది? ఎట్లా చూస్తున్నది? భగవంతునే చూస్తున్నది. ప్రకృతిని చూడటం లేదు. తన దృష్టిని భగవంతునిపైనే Concentration చేస్తూ వస్తుంది. కనుక నందిని మనం పూజిస్తున్నాము. ఈ పూజ్యత ఎట్లా కల్గింది. తన దృష్టిని దైవమువైపే మరల్చింది. కనుక పశువైనప్పటికి పూజార్హత కలిగింది. మన దృష్టి మంచి దృష్టి కావాలి. పవిత్ర దృష్టి కావాలి. అదే సుదర్శనము. మంచి దృష్టి. అలాంటి దృష్టి రావటానికి దైవమును చింతిస్తూ, దైవమును ఆరాధిస్తూ మనుష్య భావము మార్చుకొని దైవభావములో మనం చేరాలి.

1996 జూన్ 26వ తేది సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasaivechanamrutam